క్లుప్తంగా

ఘనంగా అల్లీపుర మహదేవప్ప తాత ఆరాధనోత్సవం


మహాదేవప్పతాత

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని పర్వతాపురం రోడ్డులో వెలిసిన శ్రీ అల్లీపురం మహదేవప్పతాత ఆరాధన మహోత్సవాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మఠం కమిటీ అధ్యక్షులు తిమ్మన్నగౌడ ఆధ్వర్యంలో తాతకు పంచామృతాభిషేకం, పూలు, వెండి అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 36వ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో చౌకిమఠం, కల్లుమఠం పీఠాధిపతులు మరిరాయచోటి మహాస్వామి, గురుసిద్ధ మహాస్వాములు పాల్గొని తాతను దర్శించుకున్నారు. ధర్మ సందేశాన్ని భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కన్నె మల్లికార్జున, కన్నె గణేష్, రాయచూరు ఉదయ్‌కుమార్, మరియాని చెన్నబసప్ప, వేదమూర్తి, హోసూరు నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఆత్మ పీడీ రత్నప్రసాద్

ఎమ్మిగనూరురూరల్: రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయ యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్ రత్నప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే సమన్వయకర్త డా. కె రాఘవేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ఇన్‌పుట్ డీలర్లకు డీఏఈఎస్‌ఐపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మారుతున్న సాంకేతిక పద్ధతులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి రేఖారెడ్డి, జయచంద్ర, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీచందన, మౌనిక, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి తోడ్పాటు


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పెద్దకడబూరు: మండల కేంద్రానికి చెందిన నరసింహులు నెల కిత్రం అనారోగ్యంతో మృతువాత పడ్డాడు. ఆయన కుంటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న 2004 -2005 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆర్థిక సాయం అందించారు. మిత్రులందరి నుంచి రూ. 21వేలు సేకరించి శుక్రవారం నరసింహులు కుటుంబసభ్యులను కలసి నగదును అందజేశారు.

గోడౌన్‌ల బాడుగ కట్టకపోతే సీజ్

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లకు ఏర్పాటు చేసిన గోడౌన్‌లకు బాడుగ కట్టకపోతే ఈనెల 18వ తేదీన సీజ్ చేస్తామని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం హెచ్చరించారు. యార్డులో కొంతమంది బాడుగ కట్టకుండా క్రయ, విక్రయాలు చేస్తున్నారన్నారు. మరి కొంతమంది లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోకుండా గోడౌన్‌లను వినియోగించుకుంటున్నారని చెప్పారు. 18వ తేదీ లోగా అద్దెలు కట్టి, లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు.

కోసిగి తహసీల్దార్‌గా రుద్రగౌడ



కోసిగి: మండల తహసీల్దార్‌గా రుద్రగౌడకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో ఆయన పూర్తి స్థాయి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ తహసీల్దార్ నిత్యానంద రాజుకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో వైఎస్సార్ జిల్లాకు వెళ్లారు.

ఓటమి గెలుపునకు నాంది


పోటీలను ప్రారంభిస్తున్న మహంతస్వామి

కౌతాళం: ఓటమి గెలుపునకు నాంది అని హాల్వి మఠం పీఠాధిపతి మహంతస్వామి అన్నారు. గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి జాతర సందర్భంగా గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం పీఠాధిపతి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో నడుచుకోవాలని, నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉన్నతమైన స్థానాలకు చేరాలని, అప్పుడే భగవంతుని ఆశీస్సులు ఉంటాయన్నారు. పోటీల్లో విన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.50వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు 30వేలను స్థానిక నేతలు అందజేస్తారన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆదోనిలోని కోట శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి, ఉత్తర ద్వారంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు


ఉరుకుంద ఈరన్నస్వామికి వెండి పల్లకీలో పూజలు చేస్తున్న అర్చకులు


ఎమ్మిగనూరులో స్వామి వారి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

వైకుంఠ ద్వార దర్శనం.. సర్వ పాపహరణం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఉత్తరద్వారం గుండా స్వామిని దర్శించుకున్న భక్తులు


ఆదోనిలో ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయ ఆవరణలో క్యూలో వేచి ఉన్న భక్తులు

ఆదోని అర్బన్: అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు శ్రీ వేంకటేశ్వరస్వామికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఏకా దశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. గోవిందా.. గోవిందా నామస్మరణతో పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలు మారుమోగాయి. పట్టణంలోని తిరుమలనగర్‌లో వెలిసిన శ్రీ పద్మావతి, వేంకటేశ్వరస్వామి, ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ కృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణుడికి, ఇస్వీ రోడ్డులో వెలిసిన నల్లకొండ పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈరన్న స్వామి సన్నిధిలో...

కౌతాళం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకదశి కావడంతో భక్తులు వేలాది తరలివచ్చి స్వామి దర్శనానికి క్యూ కట్టారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి వెండి పల్లకీలో ప్రకారోత్సవం నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. పల్లకోత్సవం అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని వైకుంఠ ద్వారా కొలువుంచారు. వైకుంఠ ఏకదశి కావడంతో ఉత్తర ద్వారం గుండా భక్తులను దర్శనానికి వదిలారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఉరుకుంద క్రాస్ రోడ్డు పాపయ్య కొండ సమీపంలో కొలువైన వేంకటేశ్వర స్వామికి భక్తులు విశేష పూజలు చేపట్టారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని అర్చకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో వేకువ జామున నుంచి స్వామి వారికి ప్రతేయ్క పూజలు గావించారు. భక్తులకు ఉత్తర ద్వారం గుండా స్వామి వారి దర్శనం కల్పించారు.

ఎమ్మిగనూరు శ్రీవారి ఆలయంలో ..

ఎమ్మిగనూరురూరల్ : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తిరువుల నగర్ శ్రీవేంకటసాయి ఆలయం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఆలయ నిర్వహకులు యు.శ్రీనివాసుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున 4 గంటలకు శ్రీవారి నగర సంకీర్తనను నిర్వహించి శ్రీవారిని మేలుకొల్పారు. 7గంటలకు శ్రీవారికి పన్నీటి అభిషేకం చేశారు. 7.30గంటలకు వైకుంఠ ద్వారాం ప్రవేశం, 10గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి,భూదేవిల కళ్యాణం జరిపించి, హోమం నిర్వహించారు. వైకుంఠ ద్వారం నుంచి భక్తులు శ్రీవారి దర్శనభాగ్యాన్ని పొంది తరించారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయం వద్ద నుండి శాంతిహోమ్ సర్కిల్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ఇంద్రానగర్, వెంకటాపురం కాలనీలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. మండల పరిధిలోని కందనాతి గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక జరిపించారు.

ఎమ్మిగనూరుటౌన్: అన్నమయ్య సర్కిల్‌లోని శ్రీ వెంకటసాయి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవంలో ఇరువురు నాయకులు పాల్గొన్నారు. భక్తులు గోవింద నామస్మరణతో పాల్గొని రథాన్ని లాగారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో సాయంత్రం ఎమ్మెల్యే డా.బీవీ జయనాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.రుద్రగౌడ్, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం రథం తాడులాగి రథోత్సవాన్ని ప్రారంభించారు.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోనెగండ్లలోని ఈశ్వర దేవాలయం, నీలకంఠేశ్వర దేవాలయం, శ్రీ చింతలాముని, నల్లారెడ్డి దేవాలయంలో స్వామి వారికీ ఆకుపూజ, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రాలయంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు


వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం: పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయంలో ముక్కోటి ఏకదాశి వేడుకలు వైభవంగా జరిగాయి. పాతవూరులో శ్రీ రాఘవేంద్ర స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠింపబడిన శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో వేడుకలు కనుల పండువగా సాగాయి. వైకుంఠ ఏకదాశి సందర్భంగా ఉత్తరద్వారం ఏర్పాటు చేసి భక్తులకు శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం కల్పించారు. పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో వేకువజామునే ఏకదాశి పూజలు శాస్త్రోత్తకంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి శవనామవళి పఠిస్తూ అభిషేకాలు, పుష్పర్చనలు గావించారు. భూదేవి,శ్రీదేవి సమేత శ్రీ వారికి వైభవోపేతంగా అలంకరణలు గావించి పూజలు నిర్వహించారు. భక్తులు సూర్యోదయం నుంచే వైకుంఠ ద్వార ప్రవేశానికి బారులు తీరారు. ముందుగా పీఠాధిపతి ఉత్తరద్వార ప్రవేశంతో వేడుకలకు అంకురార్పణ చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ద్వారంలో ప్రవేశించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్కరాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశెట్టి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ఎమ్మిగనూరు అన్నమయ్య సర్కిల్‌లోని వెంకటసాయి దేవాలయం వద్ద వైకుంఠ ద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ఎమ్మిగనూరు వెంకటసాయి దేవాలయంలో స్వామి వారి కల్యాణోత్సవం


ఎమ్మిగనూరులో రథోత్సవంలో కోలాటం చేస్తున్న సేవకులు


కోసిగిలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం


పెసలబండలో ర్యాలీలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్, అధికారులు

ఆదోని రూరల్: రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కరించబడతాయని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని పెసలబండ గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం గ్రామంలో సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికైనా రైతులకు రీసర్వేలో అనుమానాలు ఉంటే అర్జీలు సమర్పించాలన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు విచారణ చేపట్టి రీ సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, రీ సర్వే ఉప తహసీల్దార్ పెద్దయ్య, సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ హనుమంతు పాల్గొన్నారు.

సమస్యలుంటే చర్యలు తీసుకుంటాం

పెద్దకడబూరు: రీ సర్వేలో భూములలో లొటుపాట్లు ఉంటే తక్షణమే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో తహసీల్దారు శ్రీనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం రీ సర్వే గ్రామసభ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి గ్రామంలో భూ రీ సర్వే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్ఐ జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి గోనెగండ్లలో రీ సర్వే

గోనెగండ్ల : ఈనెల 20వ తేదీ నుంచి మండల కేంద్రం గోనెగండ్లలో రీ సర్వే ప్రారంభం అవుతుందని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం గోనెగండ్లలో రైతులు, రెవెన్యూ సిబ్బంది స్థానిక బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

చేతబడి చేశారని ఫిర్యాదు

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ఈరన్న పొలంలో గురువారం రాత్రి ఎవరో చేతబడి చేసిన ఆనవాళ్లు కనిపించాయి. శుక్రవారం దానిని గమనించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పౌష్టికాహారం పంపిణీ

ఆదోని సెంట్రల్: క్షయ వ్యాధి గ్రస్తులకు ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద డాక్టర్ షేకన్ బాను దా తల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. శుక్రవారం క్షయవ్యాధి సెంటర్‌లో జరిగిన కార్యక్ర మంలో పురపాలక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిరంజన్, ఫయాజుద్దీన్ సహకారంతో 20మంది క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నందవరం : మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీఓ పుల్ల య్య శుక్రవారం పరిశీలించారు. అలాగే గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

ఆదోని టౌన్: ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి పరీక్షిస్తారని వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పించే పోస్టర్‌లను విడుదల చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎమ్మిగనూరుటౌన్/ఆదోనిఅర్బన్/కోసిగి: విద్యుత్ ఉపకేంద్రంలో, పలు లైన్లలో పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎమ్మిగనూరు పట్టణంలోని పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ నాగేంద్రప్రసాద్, ఏఈ ప్రసన్న ఆంజనేయులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆదోని పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పురుషోత్తం తెలిపారు. కోసిగి మండలంలో నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ వీరేష్ తెలిపారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలకు సర్వం సిద్ధం


ఆట వస్తువులను చూపుతున్న పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పూర్వ విద్యార్థులతో నిర్వహించే మహాసమ్మేళన వేడుకల్లో భాగంగా ఉదయం 9గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, గురువులకు సన్మానంతో పాటు పాఠశాల, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం ఉన్నత హోదాలో వున్న వారి ప్రసంగాలుంటాయని తెలిపారు. పూర్వ విద్యార్థుల వాహనాల పార్కింగ్‌కు బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు. మహాసమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు హరినారాయణ రెడ్డి, ఎంసీ శివకుమార్, నటరాజ్‌రెడ్డి, మల్లికార్జున, షఫీవుల్లా, మాచాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై బహిరంగ విచారణకు సిద్ధం

- స్థలం ఎక్కడైనా సరే..
- ఎమ్మెల్యే పార్థసారథికి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సవాల్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూదందాలు, భూ కబ్జాలకు పాల్పడినట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదని, బహిరంగ విచారణకు తాను సిద్ధమని, ప్లేస్ నువ్వు చెప్పినా సరే, నేను చెప్పినా సరే అని ఎమ్మెల్యే పార్థసారథికి ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ఎమ్మెల్యే సాయినామ జపం చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. తాను భూకబ్జాలకు పాల్పడి ఉంటే ఆధారాలతో నిరూపించాలన్నారు. ఇటీవల 321ఏ సర్వేనంబర్‌లోని 6.51 ఎకరాల భూమిని కబ్జా చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. ఆదోని చరిత్రలో ఇలాంటి భూకబ్జాలు, రాజకీయ నాయకుల నడవడికలు లేవన్నారు. ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడు ఓ డాక్టర్ విలువైన ప్లాట్లను రిజిస్టర్ చేయించుకున్న విషయం ఆదోనివాసులకు తెలుసు అని చెప్పారు. భూకబ్జాల ప్రధాన నిందితులు ఇప్పటివరకు అరెస్టు కాలేదని, ఈ కబ్జాలో కూటమి నేతల హస్తం ఉందని ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు.

ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలి..

ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై కబ్జాకు పాల్పడ్డాడంటూ ఆరోపణలు చేయడం ఎమ్మెల్యే మానుకోవాలని సూచించారు. 11 సర్వే నంబర్‌లను ఎమ్మెల్యే ప్రకటించడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో సర్వే నంబర్‌లు చాలా ఉంటాయని, వాటన్నింటికీ నేను బాధ్యుడు కాదన్న విషయం ఎమ్మెల్యే గుర్తించుకోవాలన్నారు. తాను పంచాయతీలు చేస్తానని ఎమ్మెల్యే చెప్పడం భావ్యం కాదన్నారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరక న్యాయం కోసం తనవద్దకు వచ్చే ఎవరితోనైనా చర్చించి న్యాయం చేయడమే తాను లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాను తప్పు చేయలేదని, ఆపదలో ఉన్న వారిని అన్నివిధాలా ఆదుకున్నానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.నాగరాజ్, నాయకులు, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ ఫయాజ్, యూత్ నాయకులు సన్ని, చిన్న ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో శుక్రవారం నక్కల నరసమ్మ అనే మహిళ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బసవరాజు, గ్రామ సర్పంచ్ ఉచ్చప్ప బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చులకై కాంట్రాక్టర్ బసవరాజు రూ.5 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిన్నహనుమంతరెడ్డి, బొంపల్లి చిన్నన్న, కోసిగి రామిరెడ్డి, తలారి రామదాసు తదితరులు ఉన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

కోసిగి: జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ పీడీ వెంకటరమణయ్య వెల్లడించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 17వ విడుత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. కోసిగి మండలంలో 24 పంచాయతీలలో 01-01-2023 నుంచి 31-03-2024 మధ్య ఆర్థిక సంవత్సరంలో జరిగి జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద జరిగిన ఉపాధి పనులు, పంచాయతీ రాజ్ రోడ్డు, హౌసింగ్ పనులకు సంబంధించిన తనిఖీలు చేపట్టారు. ఇందులో 24 పంచాయతీలలో రూ.11,57,339 అవినీతి జరగగా రికవరీకి ఆదేశించి, రూ.86వేలు పెనాల్టీ విధించారు. సమావేశంలో అడిషన్ పీడీ మాధవీలత, విజిలెన్స్ అధికారి (డీవీఓ) ఆదినారాయణ, ఏపీడీ లోకేశ్వర, ఏపీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం





నాగేషప్ప బసిరెడ్డి శివప్ప గౌడ్ కృష్ణారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్/మంత్రాలయం/ఆదోని టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లోని మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షుడిగా కామర్తి నాగేషప్ప, ఎమ్మిగనూరు మండల అధ్యక్షుడిగా బీఆర్ బసిరెడ్డి, నందవరం శివప్ప గౌడ్, గోనెగండ్ల కేవీ కృష్ణారెడ్డిలను నియమించారు. మంత్రాలయం నియోజకవర్గంలో మంత్రాలయం మండలం గుర్రెడ్డి భీమారెడ్డి, పెద్దకడబూరు రామ్మోహన్‌రెడ్డి, కోసిగి జి.బెట్టనగౌడ, కౌతాళం కె.ప్రహ్లాదాచారి, ఆదోని మండల అధ్యక్షుడిగా ఆర్.గురునాథ్ రెడ్డి నియమితులయ్యారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరుక ఇళ్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి రూ. ఐదు లక్షలు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయకార్యదర్శి సమీవుల్లా, రైతు సంఘ నాయకుడు కేసీ జబ్బార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి, ధర్నా చేసి వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు ఈరమ్మ, సీపీఐ నాయకులు దాదావలి, విరూపాక్షినాయుడు, తిమ్మ గురుడు పాల్గొన్నారు.

నందవరం : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని నందవరం వీఆర్వో రామేశ్వరికి అందజేశారు.రైతు సంఘం తాలుకా కార్యదర్శి శాతంప్ప, నాయకులు ముని, రాజు, విజయ్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ,సీపీఐ నా యకులు జాఫర్ పటేల్, తిక్కన్న పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు,మండల కార్యదర్శి కవిరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.